కనుల పండువగా సిడిమానోత్సవం

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో బుధవారం మారెమ్మ జాతరలో భాగంగా సిడిమాను ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. కర్ణాటకలోని గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో ఏటా జరిగే జాతరను పురస్కరించుకుని బెళుగుప్ప తండాలో కూడా మారెమ్మ పండుగను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మారెమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకుడు చంద్రానాయక్ అమ్మవారి పూనకంతో సిడిమానుకు ఉండి చుట్టూ తిరుగుతూ భక్తులపై పూలను చల్లి ఆశీర్వదించారు. భక్తితో జరిగే కార్యక్రమం ద్వారా గ్రామంలో పాడిపంటలు వృద్ధి చెందుతాయని గ్రామస్తుల నమ్మకం.

ఘనంగా మారెమ్మ ఉత్సవాలు

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం, కె.పి.దొడ్డి, గౌనిగుంట గ్రామాల్లో మారెమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని మంగళవారం జలధికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లో మేళతాళాలు, ఊరాలతో ఘనంగా ఊరేగించారు.బుధవారం వేకువజామున భక్తులు భక్తిశ్రద్ధలతో వేప చీరలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కుందుర్పి: మండంలోని వివిధ గ్రామాల్లో మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మందలపల్లిలో నిర్వహించిన జాతరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌ఎం మోహన్‌రెడ్డి హాజరై అమ్మ వారికి పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు నాగేంద్ర, పెద్దపయ్య, బి.టి.రాము, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.




బెళుగుప్ప తండాలో సిడిమాను ఉత్సవంలో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు చంద్రానాయక్, రంగసముద్రం గ్రామంలో పూజలందుకున్న మారెమ్మ దేవత

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ

ఉరవకొండ: పట్టణంలోని రేణుమాకుపల్లి రహదారి వద్ద కుర్ణి కులస్థుల దైవం నీలకంఠేశ్వరస్వామి ఆలయంతో పాటు కమ్యూనిటీ భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీశైల నీలకంఠేశ్వర ఆలయ పీఠాధిపతులు జగద్గురు నీలకంఠేశ్వరస్వామి, కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ జోనల్ చైర్మన్ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ, కమ్యూనిటీ భవనానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం కుర్ణి సంఘం నాయకుడు నేసే కోదండరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బుట్టా రేణుక మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుర్ణి కులస్థులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.1.50 కోటి విలువ చేసే స్థలాన్ని కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఇప్పటికే ఉరవకొండలో చేనేత వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ద్వారా అనేక పథకాలు మంజురు చేయించారన్నారు. ముఖ్యంగా చేనేతల అభ్యున్నతి కోసం చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ మంజురు చేశారన్నారు. ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ చేనేత కులస్థుల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్యే విశ్వ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ. 50 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. పీఠాధిపతి మాట్లాడుతూ ఆలయ, కమ్యూనిటీ నిర్మాణాలను ఐకమత్యంతో పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, కమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, వెంకటేష్, చేనేత నాయకులు సాధు కుళ్లాయిస్వామి, చెంగల మహేష్, ఎంసీ నాగభూషణం, మిడతల చంద్రమౌళి, గట్టు ఎర్రిస్వామి, పార్టీ నాయకులు ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, అశోక్ పాల్గొన్నారు.



నీలకంఠేశ్వరస్వామి ఆలయ, కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక, యువనేత ప్రణయ్

పంట సంజీవని పరికరాలను వృథా చేయొద్దు

వజ్రకరూరు: పంట సంజీవని పరికరాలను వృథా చేయకుండా, రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని డీపీఎం ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం జిల్లా స్థాయి అధికారుల బృందం పర్యటించింది. ఈసందర్భంగా మండలంలోని రాగులపాడు, వెంకటాంపల్లి గ్రామాల్లో పంట సంజీవని పథకంలో భాగంగా రైతులకు అందజేసిన రేయిన్‌గన్‌లు, ఆయిల్ ఇంజిన్లు, స్ప్రింకర్లు, వాటర్ క్యారియర్ పైపులు తదితర వాటిని ఏపీఎంఐపీ పీడీ ఫీరోజ్‌ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, హార్టికల్చర్ డీహెచ్‌ఓ రఘునాథరెడ్డి ఏడీఏ పద్మజతో కలసి ఆమె పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గతంలో అందజేసిన పంట సంజీవని పరికరాలను రైతులు సమష్టిగా వాడు కోవాలన్నారు. పరికరాలను వృథా చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రైతులు ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భూ సార సంరక్షణ శిక్షణ కేంద్రం ఏఓ ప్రతాప్, మండల వ్యవసాయ అధికారి మధుకర్, హార్టికల్చర్ నియోజకవర్గ అధికారి నెట్టికంటయ్య, ఎంపీహెచ్‌ఈఓలు రామక్రిష్ణ, మోహన్, వీహెచ్‌ఏ ధాకూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాగులపాడులో పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా స్థాయి అధికారుల బృందం

నేడు హిందూ మహాగణపతి శోభాయాత్ర

రాయదుర్గం/టౌన్: వినాయక చవితిని పుష్కరించుకుని రాయదుర్గం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో కొలువుదీర్చిన హిందు మహా గణపతి బ్రహ్మోత్సవాలు 10 రోజుల నుంచి వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు గురువారం మహాగణపతి నిమజ్జనోత్సవానికి నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు మహాగణపతి లడ్డూ వేలం, ఆ తరువాత లక్కీ లాటరీ డిప్ ప్రక్రియ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి కారు, రెండో బహుమతి ఎలక్ట్రిక్ స్కూటర్‌తోపాటు కన్సులేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అన్నదానం పూర్తయిన అనంతరం నిమజ్జన శోభాయాత్ర ప్రారంభిస్తామన్నారు. ఊరేగింపులో మేళతాళాలు, డప్పులు, నందికోలు, తాషాలు, చెక్కభజన , కోలాటాలు, డీజేలు ఉంటాయన్నారు. . రాయదుర్గం ప్రాంత ప్రజలు మహాగణపతి శోభాయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు దేవరెడ్డిపల్లి రాజేష్, గౌని ప్రతాప్ తెలిపారు. నిమజ్జనం పూర్తయ్యే వరకూ పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేస్తున్నట్టు అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపారు.



అలంకరణలో హిందూ మహాగణపతి

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

కణేకల్లు: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని డీఈఓ నాగరాజు సూచించారు. కణేకల్లు జెడ్పీ బాలుర హైస్కూల్‌ను బుధవారం డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్‌తో కలసి డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రాసిన నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఉపాధ్యాయులకు సూచించారు. లెసన్ ప్లాన్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని, డైరీలో బోధించిన పాఠాలు, ఇతర వివరాలను రాయలన్నారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్, హెచ్ఎం నరసింహులు పాల్గొన్నారు.

బోధన సులభతరంగా ఉండాలి

కూడేరు: పిల్లలకు అర్థమయ్యే రీతిలో సులభతరంగా విద్యా బోధన చేయాలని ఎంఈఓ-2 సాయి కృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జల్లిపల్లి, కూడేరు, కరుట్లపల్లి హైస్కూల్స్ క్లస్టర్లలోని సోషల్ ఉపాధ్యాయులకు పిల్లల్లో విద్యా సామర్థ్యం పెంపొందించుటపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ-2 జల్లిపల్లి హైస్కూల్‌లో జరుగుతున్న శిక్షణ తరగతులను ఆయన తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసి కార్పొరేటుకు దీటుగా బడుల్లో వసతుల కల్పన చేస్తోందన్నారు. విద్యా బోధన బాగా చేసి పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు.హెచ్ఎం వెంకటేష్ బాబు, సీఆర్పీలు రమణ, ఆదిలక్ష్మీ, శివ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభి షేకం

ఉరవకొండ: బేడ, బుడగ జంగాల కులాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని సిఫార్సు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినందుకు కృతజ్ఞతగా బుధవారం నియోజకవర్గంలోని బేడ, బుడగ జంగం సంఘం నాయకులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ ర్యాలీగా వచ్చి క్లాక్‌టవర్ వద్ద ఉన్న దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుడగ జంగం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు మహేంద్ర మాట్లాడుతూ సీఎంకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో బేడ, బుడగ జంగం నాయకులు నాగయ్య, మారెన్న, కుళ్లాయప్ప, అంజి, గోపాల్, సుధాకర్, బాలయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రటానికి క్షీరాభిషేకం చేస్తున్న బేడ, బుడగ జంగం నాయకులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కళ్యాణదుర్గం: పరిశుభ్రత అందరి బాధ్యత అని వక్తలు అన్నారు. పట్టణంలో బుధవారం మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూచనల మేరకు సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛతాహి సేవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నార్తు హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇచ్చిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు దివ్యశ్రీ, రాధ, కవిత, వలి, శ్రీకాంత్, సతీష్‌లతో పాటు నార్తు హైస్కూల్ హెచ్ఎం గాయత్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కూడేరు: గడప గడపకూ మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతం గా పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అభివృద్ధి పనులు..జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆయన మండల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ×జగనన్న ఆరోగ్య సురక్ష² సర్వే పక్కాగా జరగాలన్నారు. నిర్మాణ దశను బట్టి వెంటనే బిల్లులు మంజూరు చేసి పక్కా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం జగనన్న కాలనీలో స్వచ్ఛ భారత్ కింద లబ్ధిదారులు తవ్వుకుంటున్న ఇంకుడు గుంతలను ఆయన పరిశీలించారు. ప్రతి లబ్ధిదారుడూ ఇంకుడు గుంత తవ్వుకోవాలని, అందుకు ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్, డాక్టర్ సరిత,ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏఓ నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి

బాల్య వివాహాలు అరికడదాం

బ్రహ్మసముద్రం: బాల్య వివాహాలు అరికట్టి ఆడబిడ్డలను కాపాడుకుందామని తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీఓ దాసానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మహిళ, శిశు సంక్షేమ శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల కట్టడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా తీవ్ర ఒత్తిడికి గురై ప్రసవ సమయంలో తల్లీబిడ్డలు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాల్య వివాహాలకు ప్రయత్నించినా, సహకరించినా జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్డీటీ ఆదినారాయణ, ఎంఈఓ ఓబుళపతి, ప్రిన్సిపాల్ సత్యవతమ్మ, ఏఓ నందకిశోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఖాసింబీ , రామాంజనమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, మేరీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధుల మంజూరు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ రమావత్‌దేవి, వైఎస్సార్ సీపీ రై తు విభాగం రాష్ట్ర కార్యదర్శి కమలపాడు వెంకటరెడ్డి తెలిపారు.బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి చొరవతో ఉపాధి పథకం కింద 2023- 24 సంవత్సరానికి సంబంధించి రూ.60 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కమలపాడులో 28 లక్షలతో సీసీ రోడ్లు, కడమలకుంటలో రూ.8లక్షలతో సీసీ రోడ్లు, ధర్మపురిలో రూ.8 లక్షలతో సీసీ రోడ్లు, వజ్రకరూరులో రూ.6 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని గూళ్యపాళ్యంలో రూ. 12 లక్షలతో డ్రైనేజీ పనులు చేపడతామన్నారు.

సంక్షిప్త సమాచారం

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 3న ఉదయం 10 గంటలకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. మెకానికల్, సివిల్ కోర్సుల్లో ఖాళీలున్నాయన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో రూ.5,800 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

డీసీహెచ్ ఆకస్మిక తనిఖీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని బుధవారం సాయంత్రం డీసీహెచ్ రవికుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారి మాధవి, వైద్యులతో కలిసి ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. వైద్య చికిత్సలు ఏ విధంగా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ముఖ్యంగా కాన్పులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాధారణ కాన్పులను ఎట్టి పరిస్థితుల్లోనూ రెఫర్ చేయరాదన్నారు. ఆస్పత్రుల్లో ఖాళీ ఉన్న వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు ఉమామహేశ్వర్, జ్యోతి, మోహన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కణేకల్లు: మండలంలోని నాగేపల్లి శివారులో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గరుడచేడుకు చెందిన చంద్ర కణేకల్లు నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తుండగా తుంబిగనూరు నుంచి నాగేపల్లికి అభి తన స్నేహితుడు జగదీష్‌తో కలిసి బైక్‌లో వెళ్తూ పరస్పరం ఢీ కొన్నారు. ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని కణేకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి అనంతపురానికి రెఫర్ చేశారు.

వజ్రకరూరులో ఇద్దరికి..

వజ్రకరూరు: మండల కేంద్రం సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వెంకటాంపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన కుమార్‌నాయక్ అనే వ్యక్తి గుంతకల్లు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. గంజికుంట గ్రామానికి చెందిన మన్సూర్ అనే వ్యక్తి వజ్రకరూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో గంజికుంట ప్రధాన రహదారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఘటనలో కుమార్‌నాయక్‌కు తీవ్ర గాయాలు కాగా, మన్సూర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కుమార్‌నాయక్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పో లీసులు తెలిపారు.

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

వజ్రకరూరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించమని ఎంపీడీఓ విజయలలిత హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ వందరోజులు తగ్గకుండా పనులు కల్పించాలని, అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు మంజూరు చేయాలని ఆదేశించారు. బిల్లులు పెండింగ్‌లో ఉంచకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ప్రభాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనంతపురానికి చెందిన ఆర్డీటీ ప్రతినిధులు రూ. లక్ష విలువ చేసే పుట్‌బాల్స్, షూస్, సాక్స్, ఇతర క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు హలీమా, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శెట్టూరు: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని ములకలేడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక పాఠశాలలో బుధవారం విద్యార్థులను హెచ్ఎం నరసింహులు, ఎంఈఓ -2 వాణీదేవి, పీడీ శివకేశవులు, ఉపాధ్యాయులు అభినందించారు. వారు మాట్లాడుతూ అండర్ -17 విభాగంలో గొల్ల రాధిక, అండర్ -14 విభాగంలో సింధూజ, అంజలి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 1 వరకూ గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కబడ్డీ పోటీలకు ...



మోడల్ స్కూల్ విద్యార్థిని సావిత్రి

ఉరవకొండ: మండలంలోని చిన్నమూస్తురు ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ చదువుతున్న సావిత్రి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రశస్త కుమారి బుధవారం తెలిపారు. అనంతపురం నగరంలోని అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపిన సావిత్రి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

విద్యతోనే పేదరికం దూరం



మాట్లాడుతున్న గౌని ఉపేంద్రారెడ్డి

రాయదుర్గం: విద్యతోనే పేదరికాన్ని శాశ్వతంగా దూరం చేయొచ్చనే నమ్మకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యారణ్య జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతి పూజ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యావ్యవస్థను బలోపేతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. పిల్లలను బడులకొస్తే చాలు అన్నీ తానై సీఎం జగన్ చూసుకుంటున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వాల్మీకి పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సమానంగా సాగునీరు



మాట్లాడుతున్న హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలో 9వ డిస్ట్రిబ్యూటరీ బ్రాంచ్ కాలువ పరిధిలో ఉన్న గోవిందవాడ, బొల్లనగుడ్డం, తారకాపురం గ్రామాల శివారులో ఉన్న ఆయకట్టు రైతులకు సమానంగా సాగునీరు అందిస్తామని హెచ్చెల్సీ అనంతపురం ఈఈ రమణారెడ్డి తెలిపారు. 9వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో సాగునీటి విషయంలో కొద్ది రోజులుగా ఇరుగ్రామాల రైతుల మధ్య గొడవ జరుగుతున్న నేపథ్యంలో ఈఈ రమణారెడ్డి కాలువను పరిశీలించి రైతులతో మాట్లాడారు. హెచ్చెల్సీ నీరు ఈసారి ఆశించిన స్థాయిలో రావడం లేదని, నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఇక నుంచి అన్ని గ్రామాల రైతులకు సమానంగానే నీరు అందుతాయన్నారు. కార్యక్రమంలో డీఈ మద్దిలేటి పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు



మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకల సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఆకాంక్షించారు. బుధవారం మంత్రి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ముస్లిం దైవ మార్గంలో నడవాలన్నారు. సాటి మానవుల పట్ల సేవాభావం పెంపొందించుకోవాలనే ప్రవక్త సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రజలు అల్లా దీవెనలతో సుఖసంతోషాలతో జీవించాలని మంత్రి ఆకాంక్షించారు.

కౌన్సిల్ సమావేశం రేపు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

బైక్ రిపేరీపై నైపుణ్య శిక్షణ

కళ్యాణదుర్గం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బైక్ రిపేరీపై నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవి మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బైక్ రిపేరీ శిక్షణతో పాటు ఇంగ్లిష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని 18–35 సంవత్సరాలు ఉండి 5వ తరగతి నుంచి పది, ఇంటర్, ఐటీఐ ఫెయిల్/పాస్ అయిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. వివరాలకు కళ్యాణదుర్గంలోని పాత ఆర్డీటీ ఆసుపత్రి, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సంప్రదించాలని లేదా 9959422884, 6303580397, 7780752418 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఉరవకొండ: పట్టణానికి చెందిన విద్యుత్ ఒప్పంద కార్మికుడు ఎర్రిస్వామి కొంత కాలం క్రితం పక్షపాతానికి గురి కావడంతో అతని కుటుంబానికి వ్యాసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉలిగప్ప రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. రూరల్ సీఐ శేఖర్ సమక్షంలో బాధితుడి భార్య సుమిత్రమ్మకు నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వన్నప్ప పాల్గొన్నారు.

ఈద్గాకు ప్రహరీ నిర్మించండి

కూడేరు: మండల కేంద్రంలోని ఈద్గా, శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని కో-ఆప్షన్ సభ్యుడు సర్దార్ వలి, ముస్లింలు ఇమామోహిద్దీన్, నిషార్, రోషన్,మహమ్మద్ రఫీ బుధవారం ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషాని కలసి విన్నవించుకున్నారు. ప్రహరీ లేకపోవడంతో ఈద్గా, శ్మశాన వాటిక స్థలం అన్యాక్రాంతమవుతోందని వాపోయారు. స్పందించిన వారు ప్రహరీ ఏర్పాటు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

పేర్లు నమోదు చేసుకోండి

బెళుగుప్ప: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం అందించే సబ్సిడీ పప్పుశనగ విత్తనాలకు రైతులు గురువారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ పృథ్వీసాగర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం మండలానికి 3,100 క్వింటాళ్లను మంజూరు చేసిందన్నారు. పప్పుశనగ విత్తన ధర క్వింటాల్ రూ.8,100 కాగా 40 శాతం సబ్సిడీ పోనూ రైతులు రూ.4,860 చెల్లించాలన్నారు.

పోషణ్ అభియాన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

ఉరవకొండ: స్థానిక రేణుమాకుపల్లి రహదారిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో పోషణ్ అభియాన్‌పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ సునీత అధ్వర్యంలో వివిధ పోషక పదార్థాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థినులు స్టాల్స్ రూపంలో పోషక పదార్థాలు, వివిధ రకాల పండ్లు, డ్రైఫ్రూట్స్, ఇతర కూరగాయాలు, ఆకుకూరలు, పిండి పదార్థాలు, అందంగా అలకరించి వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దండుమారెమ్మ గుడి ఏరియాకు చెందిన గార్మెంట్స్ యజమాని రమేష్ బుధవారం సాయంత్రం కత్తితో చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరోనా సమయంలో రూ.లక్షల విలువ చేసే గార్మెంట్స్ జీన్స్ సరుకును ఇతర ప్రాంతాల్లో విక్రయించగా సకాలంలో షాపు యజమానుల నుంచి డబ్బులు రాకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఈ ఘటనకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఇంటి పరిసరాల్లో కత్తితో చేయి కోసుకుని ఇబ్బంది పడుతుండగా స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని అనంతపురానికి తరలించారు.